క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

ఎల్కతుర్తి: మండలంలోని వీరనారాయణపూర్ లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈనెల 6న ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అమ్మవారి విగ్రహ ఊరేగింపు, 7న అమ్మవారి ఆలయ ఆవరణలో హోమాలు నిర్వహించారు. 8న అమ్మవారి స్వాతి నక్షత్రయుక్త కర్కాటక లగ్న సుముహూర్తమున రేణుకా ఎల్లమ్మదేవి జమదగ్ని ముని, శిలయంత్ర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. నేడు (సోమవారం) అమ్మవారికి గ్రామస్తులు బోనాలు సమర్పించనున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని నాగయ్యపల్లెలో మాదాసి పెద్ద కట్టమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ.4వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్, నాయకులు శ్రీనివాస్,అశోక్, సుదర్శన్, సుధాకర్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ



విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేస్తున్న నారాయణరెడ్డి

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, రజక జాతి ఆత్మగౌరవ ప్రతీక, వీరవనిత చిట్యాల ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు మునుకుంట్ల రవి, అల్వాల రాములు, పైళ్ల పరమేశ్వర్, మునుకుంట్ల చంద్రమౌళి, అలువాల భాస్కర్, మునుకుంట్ల దశరథం, వైనాల రాజేందర్, పైళ్ల రమేష్ పాల్గొన్నారు.

నీటితొట్టికి మరమ్మతులు

పరకాల: పరకాల పశువుల సంతలో శిథిలావస్థలో నీటితొట్టి నిరుపయోగంగా ఉంది. పశువులకు తాగునీటికి ఇబ్బందులు పడుతుండటంతో రైతుల నుంచి ఆందోళన కావడంతో పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ ప్రత్యేక చొరవ తీసుకొని మరమ్మతులు చేయించారు. వారం క్రితం నీటితొట్టిని పరిశీలించిన ఆయన తక్షణమే మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నుంచి నీటితొట్టిని పశువులకు అందుబాటులోకి తీసుకురావడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

చెట్టు కూలి ఇల్లు ధ్వంసం

- తప్పిన పెనుప్రమాదం



చెట్టు కూలి ధ్వంసమైన ఇల్లు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన రామగిరి వినోద ఇంటిపై చెట్టు కూలి ఇల్లు ధ్వంసమైంది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రగతి సింగారం గ్రామానికి చెందిన రామగిరి వినోద ఇంటిపై ప్రమాదవశాత్తు చెట్టు కూలిపడడంతో ఇల్లు ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. సీపీఐఎం, ఎంసీపీయూ నాయకులు చిలకల కొమురయ్య, పెంట తిరుపతిలు వినోద ఇల్లును పరిశీలించి వినోదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు కోరారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపల్లి గ్రామంలోని శివరామక్షేత్రంలో ఆదివారం ప్రసన్నాంజనేయ , భద్రకాళి సమేత వీరభద్రస్వామి, చెన్నకేశవ, సుబ్రహ్మణ్యస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం

- టార్గెట్ 78,500 మొక్కలు
- అందుబాటులో పలు రకాల మొక్కలు
- జూలై మాసంలో నాటేందుకు ప్రణాళిక



ఎల్కతుర్తి నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

ఎల్కతుర్తి : వనమహోత్సవానికి మొక్కలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మండలవ్యాప్తంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మండల వ్యాప్తంగా మొత్తం 20 గ్రామ పంచాయతీలకు 78,500 మొక్కలు (టార్గెట్) అన్ని గ్రామాలకు సరిపడా మొక్కలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో మండలంలో 19 గ్రామ పంచాయతీలు కాగా నూతనంగా రామకృష్ణాపూర్ జీపీ ఏర్పడడంతో మొత్తం 20 అయ్యాయి. ఈ గ్రామంలో సైతం మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

అందుబాటులో పలు రకాల మొక్కలు

మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు 19 గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇండ్ల పరిసర ప్రాంతాల్లో, రహదారులకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో నాటేందుకు చామంతి, లిల్లీ, మల్లె, మందార, గులాబీ, గన్నేరు, అడవి తంగేడు, కరివేపాకు మొక్కలు, తులసి, గోరింటాకు, దానిమ్మ, అల్లనేరేడు, కానుగ, వేప, చింత, కదంబి, మహాగని, దుర్శన, చీమచింత, మామిడి, ఈత తదితర మొక్కలు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు.

జూలై మాసంలో నాటనున్న మొక్కలు

మండలంలోని వివిధ గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. సరిపడా వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు వనమహోత్సవ కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరుపక్కల, ఇండ్ల పరిసరాల్లో, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో, ఖాళీ ప్రదేశాల్లో, చెరువు గట్లు, శిఖం భూముల్లో మొక్కలు నాటనున్నారు. ఇళ్లకు సరిపడా పండ్లు, పూలు, కరివేపాకు ఇతర మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

వర్షాలు కురవగానే పంపిణీ చేస్తాం



వర్షాలు కురిసిన వెంటనే అన్ని జీపీల్లో మొక్కల పంపిణీ కార్యక్రమం చేపడుతాం. నాటిన మొక్కలను సంరక్షించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– విజయ్‌కుమార్ ఎంపీడీఓ

అందరూ ఒక్కటిగా నిలవాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా కుల సంఘంగా అందరూ ఒక్కటిగా నిలవాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో రెడ్డి రైతు పొదుపు సహాయ సహకార సంఘం భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డి రైతు పరపతి సంఘం భవన నిర్మాణాన్ని రెండు, మూడు అంతస్తుల్లో మహిళలకు, కుల సంఘానికి, రైతులకు ఉపయోగపడే విధంగా నిర్మాణం చేయాలని సూచించారు. భవన నిర్మాణానికి సీడీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నానని, త్వరలోనే మరో రూ.10 లక్షలు మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. ధర్మసాగర్ రెడ్డిలకు మంచి గుర్తింపు ఉందని అన్నారు. 6 నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసుకోవాలని తెలిపారు. గడిచిన ఏడాది కాలంలో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్ల నిధులు తీసుకువచ్చానన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని, దానికి మీ అందరి సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ వి.రాజిరెడ్డి, రెడ్డి పరపతి సంఘం అధ్యక్షుడు తోకల రాంచంద్రారెడ్డి, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తోకల జయపాల్ రెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యుడు రావుల వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు నిమ్మ సుదర్శన్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి, మహిళా నాయకురాలు చాడ పుష్పమాల, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరిట పైసలు వసూలు చేస్తే చర్యలు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పరకాల: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

పరకాల: ఇందిరమ్మ ఇళ్లు, ప్రజా సంక్షేమ పథకాల మంజూరీ పేరిట ఎవరైనా లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 8, 9, 13 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పదేళ్ల తర్వాత నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేసుకొని ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్మకూరు: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేటలో ఇందిరమ్మ ఇల్లు భూమిపూజ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్ సర్కారు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం అభివృద్ధిపై దృష్టిపెడుతూ అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు వేగవంతంగా నిర్మాణం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



శాయంపేట: లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని 23 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం గంగిరేణిగూడెంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ప్రభుత్వ భవనాలపై పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇళ్లపై పెట్టలేదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ. 22వేల 500 కోట్లను ఖర్చుపెట్టి పేద ప్రజల సొంతింటి కల కోసం కేటాయించిందన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ఇళ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వలేదని, నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తుంటే చూసి ఓర్వలేక శిలాఫలకాల ధ్వంసానికి పాల్పడుతున్నారని తెలిపారు. అనంతరం మండలంలోని కాట్రపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

కమలాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణిరవీందర్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, వంగపల్లి, గూడూరు గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఆదివారం ముగ్గు పోసి భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, డైరెక్టర్ ఓర్సు తిరుపతి, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్, నాయకులు పోడేటి భిక్షపతి, గూడెపు మొగిలియ్య, కొండ తిరుపతి, మనీష్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



శాయంపేటలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హెచ్‌ఎం కాయిత శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటా తిరిగారు. బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, సదానందం, అజీముద్దిన్, బాజిబాపూరావు, సత్యప్రసాద్, ఉదయశ్రీ, రాము తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ నిర్మాణ పనులు



అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవనం

వేలేరు : మండలంలోని షోడాషపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, గ్రంథాలయ భవన నిర్మాణ పనులు నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయాయి. మూడేళ్లు గడుస్తున్నా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు స్లాబ్ దశలోనే ఆగిపోయాయి. అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన ఎమ్మెల్సీ నిధుల నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, గ్రామంలో గ్రంథాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ భవనాలను స్లాబ్ వరకు వేశాడు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలు రావడం అందులో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడంతో చేసిన పనులకు బిల్లులు రావడం ఆలస్యమైంది. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు రావడం లేదని వదిలేశాడు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ చూపి బిల్లులు మంజూరు చేయించి గ్రంథాలయం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఉధృతం



సమావేశంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

న్యూశాయంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి ఏషబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో హనుమకొండ మండల 2వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ దేశంలో పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రతరం చేస్తూ, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని అన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలు, ముస్లింలు, రైతులు, దళితులపై దాడులు కొనసాగిస్తూ, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరిట కేంద్రంలోని పాలకులు మారణహోమం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిణామాలను ప్రజాస్వామికవాదులు తిప్పికొట్టాలని కోరారు. మహాసభలో హనుమకొండ దక్షిణ మండల సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 25 మంది కౌన్సిల్ సభ్యులతో సమితిని ఏర్పాటు చేశారు. నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, స్టాలిన్, ఎల్లేశ్, రవి, నర్సయ్య, సంజయ్, వినయ్, లక్ష్మి, రజిత, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

గీసుకొండ : గ్రేటర్ శివారులోని గొర్రెకుంట కట్ట మల్లన్న ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగిందని కార్యనిర్వహణాధికారి (ఈఓ) అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. స్వీపర్ ఆదివారం తెల్లవారుజామున ఆలయానికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉండడంతో ఈఓకు సమాచారం అందించడంతో చోరీ వెలుగులోకి వచ్చింది. దొంగలు రెండు హుండీలను పగులగొట్టి రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ఈఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మకూరు : గురువులతో పూర్వవిద్యార్థులు



శాయంపేట : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు : మండలకేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో 1984లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 41 ఏళ్ల తర్వాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి గురువులు గుర్రం ఆనందం, ఈశ్వరయ్య, జీడికంటి రంగాచార్యులు నుఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగబండి శివప్రసాద్, ఎండీ.నిజాముద్దీన్, ఎర్ర శివారెడ్డి, నరేంద్రకుమార్ వర్మ, నాగిరెడ్డి, బూర వేణుగోపాల్, ఇంద్రారెడ్డి, సమ్మిరెడ్డి, సాంబమూర్తి, అర్జున్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు: మండలంలోని పంథిని ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. 2002–03లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి గురువులను పూజించుకుని శాలువాతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. ప్రస్తుత ఎంఈఓ పులి ఆనందం, విశ్రాంత ఎంఈఓ సదానంద చారి, హెచ్‌ఎం సంపత్‌రావు, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఐనవోలు : పంథిని పాఠశాలలో..

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 27 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో, మెమొంటోలతో సత్కరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంద శ్రీకాంత్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బాధ్యులు , తదితరులు పాల్గొన్నారు.

మృగశిర కార్తె సందడి



చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కమలాపూర్ : మృగశిర కార్తె రోజు తప్పకుండా చేపలు తినాలనేది అనాదిగా వస్తున్న సంప్రదాయం. దీనికి తోడు ఉబ్బసం వ్యాధిగ్రస్తులు మృగశిర కార్తె రోజు చేపలు తింటే ఆ వ్యాధి నయమవుతుందని ప్రచారంలో ఉంది. ఇందుకు అనుగుణంగానే కమలాపూర్‌లో మిగతా రోజులకన్నా మృగశిర కార్తె రోజు రెట్టింపు స్థాయిలో చేపల విక్రయాలు జరిగాయి. ఆదివారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో ప్రజల సెంటిమెంట్‌ను ఆసరాగా చేసుకున్న మత్స్యకారులు చేపల ధరలను విపరీతంగా పెంచేశారు. అయినప్పటికీ పెంచిన ధరలను సైతం లెక్కచేయకుండా కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో ఎగబడి చేపలు కొనుగోలు చేశారు.

బీటెక్ విద్యార్థినికి చేయూత

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదవనున్న నిరుపేద విద్యార్థిని, హనుమకొండకు చెందిన కోమల్ల భవ్యకు విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీజు చెల్లింపునకు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ఆదివారం జరిగిన సమావేశంలో దాతల సహకారంతో రూ.50 వేల విలువగల చెక్కును ఆ విద్యార్థినికి అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ తెలిపారు. ఆ విద్యార్థికి ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరానికి సంబంధించిన ఫీజు కూడా చెల్లించేందుకు విద్యా ఫౌండేషన్ బాధ్యత తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈమేరకు దాతలు కుందావజ్జుల కృష్ణమూర్తి, కెప్టెన్ రమాదేవి, తెలంగాణ స్త్రీ సేవా సంస్థ బాధ్యులకు మహేందర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ బాధ్యులు నరేందర్, వేదాంతం లక్ష్మమ్మ, లీల, నర్సింగరావు, విష్ణుమూర్తి, సోమయ్య, అనిత, వసంత, ఒయాసిస్ నిర్వాహకుడు చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.